భావి శాస్త్రవేత్తలకు వారధి యువికా

- యువ విజ్ఞాన్ కార్యక్రమానికి ఇస్రో శ్రీకారం
- 9వ తరగతి విద్యార్థులకు రెండు వారాల శిక్షణ
- ఆన్‌లైన్‌లో నమోదుకు ఈనెల 23 వరకు గడువు

2023-24 విద్యాసంవత్సరంలో ఎంపికైన షేక్ నొమాన్ (ఫైల్)

గిర్మాజీపేట, మార్చి 16: శాస్త్ర, సాంకేతిక రంగ అంశాలపై విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం (వైఎస్‌పీ, యువ విజ్ఞాన్ కార్యక్రమం - యువికా) పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్యాచ్ దెమ్ యంగ్ నినాదంతో విద్యార్థులకు రెండు వారాల పాటు సాంకేతిక జ్ఞానం, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించి, వారిని పరిశోధనల వైపు దృష్టి మళ్లించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. మేటి ప్రయోగాలు చేస్తున్న ఇస్రో దేశంలోని బాల మేధావులను ప్రోత్సహించేందుకు యువ విజ్ఞాన్ కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఈనెల 23వ తేదీన ముగియనుంది.

2022-23 విద్యాసంవత్సరంలో ఎంపికైన నిఖిల్‌వర్మ (ఫైల్)

ఎవరు అర్హులు.. దరఖాస్తులు ఎలా?

2024-25 విద్యా సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 8వ తరగతి వార్షిక పరీక్షల్లో మార్కుల ఆధారంగా 50శాతం, ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభ, సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న వారికి 10శాతం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వారికి 5శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారికి 15శాతం మార్కులు కేటాయిస్తారు. ఇస్రో అధికారిక వెబ్‌సైట్ WWW.ISRO. GOV.INలో లాగిన్ అయి, యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. విద్యార్థుల వివరాలను నమోదు చేయాలి.

అధిక సంఖ్యలో పాల్గొనేలా చేయాలి

జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు శాస్త్ర సాంకేతికతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి 'యువికా'లో అధిక సంఖ్యలో పాల్గొనేలా కృషిచేయాలి. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్‌ను 98488 78455లో సంప్రదించాలి.

– మామిడి జ్ఞానేశ్వర్, డీఈవో

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని తొమ్మిదో తరగతి విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన విషయాలను తెలియజేయాలి. వారిలో శాస్త్రీయ జిజ్ఞాసను మేల్కొల్పడం, అంతరిక్షం, అంతరిక్ష రహస్యాలపై ఆసక్తి పెంపొందించడం, శాస్త్రీయ సత్యాలను అన్వేషించేందుకు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

పర్వతగిరి, మార్చి 16: మండలకేంద్రానికి చెందిన దొనికె ఐలమ్మ, మామిండ్లపల్లి రమణమ్మ ఇటీవల మరణించారు. ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు సోమేశ్వరరావు, రాజేశ్వర్‌రావు, రాజు, కమలా పంతులు, శ్రీనివాస్, కుమార్, బాలరాజు, బాబు, హరీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న దయాకర్‌రావు

మహిళలకు చీరెల పంపిణీ

పోచమ్మమైదాన్, మార్చి 16: రంజాన్ సందర్భంగా వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో పేద ముస్లిం మహిళలు, జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య కార్మికులకు ఆదివారం రాత్రి చీరెలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు దుబాసి సమ్మక్క ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ పుర్ఖాన్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు జూపాక అనిల్‌కుమార్, తూడి రవీందర్, స్వర్గం కవిత, నూనె లీలావతి పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ చేస్తున్న నాయకులు

రంజాన్ మాసంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు

కరీమాబాద్, మార్చి 16: రంజాన్ మాసంలో ఈద్గాకు వచ్చే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ తెలిపారు. ఫోర్టురోడ్డులోని ఖిలావరంగల్ ఈద్గాలో ఆదివారం ఆయన మైదానాన్ని చదును చేయించారు. ఏటా ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో మైదానాన్ని శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. ఇఫ్తార్ విందుతోపాటు ప్రార్థనలకు వచ్చే వారికి అనువుగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్‌పాషా, హసన్ అలీబేగ్ పాల్గొన్నారు.

ఈద్గాలో పనులు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పోలీసులు.. అధికార పార్టీ తొత్తులు

- లాఠీచార్జి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఫొటోలను ప్రదర్శిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, మార్చి 16: నర్సంపేట నియోజకవర్గంలో పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గిర్నిబావిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న గిర్నిబావిలో లాఠీచార్జి ఘటనలో బాధ్యులైన పోలీసులపై విచారణ జరిపేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు పోలీసులు అత్యుత్సాహంతో ఆయుధాలు లోడ్ చేస్తూ ఫైర్ ఇంజిన్ ప్రదర్శించి భక్తులు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని, ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఏకపక్షంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్ణీత సమయానికే బీఆర్ఎస్ ప్రభబండ్లు వచ్చాయని, కావాలనే అధికార పార్టీ ప్రభబండ్లను ముందుగా తరలించారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి లాఠీచార్జి చేశారని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విలేకరులపై కేసులు పెడుతున్నారని, దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గదిలో అధికార పార్టీ నాయకుడికి ప్రత్యేక కుర్చీ వేసి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, క్లస్టర్ ఇన్‌చార్జి కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మేరుగు రాంబాబు, శంకేశి కమలాకర్, పిండి కుమారస్వామి, సింగతి రాజన్న, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, రవీందర్, ఉమేశ్‌రెడ్డి, మహేందర్, సద్ది ఆయిల్‌రెడ్డి, యార మెహన్‌రెడ్డి, యార శ్రీనివాస్, నునావత్ రాజునాయక్ పాల్గొన్నారు.

వేటగాళ్లను పట్టించిన యాక్సిడెంట్

- అటవీ జంతువుల మాంసాన్ని తరలిస్తున్న నలుగురు వ్యక్తులు
- ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టడంతో వెలుగులోకి..

పంచనామా నిర్వహిస్తున్న అటవీ అధికారులు

ఖానాపురం, మార్చి 16: ఓ రోడ్డు ప్రమాదం అటవీ జంతువులను చంపుతున్న వేటగాళ్లను పట్టించింది. ఈ ఘటన మండలంలోని పాకాల చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగింది. నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ కథనం ప్రకారం.. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నర్సంపేట నుంచి కొత్తగూడ మండలం పూనుగొండ్లకు బయల్దేరింది. ఈ క్రమంలో చిలుకమ్మనగర్ నుంచి ఆటో నర్సంపేట వైపు వస్తున్నది. పాకాల చెక్‌పోస్టు సమీపంలోకి చేరుకోగానే ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. వెంటనే ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ బస్సులో నుంచి కిందకు దిగి ప్రమాదాన్ని పరిశీలిస్తున్న క్రమంలో ఆటోలో నుంచి నలుగురు వేటగాళ్లు అక్రమంగా తరలిస్తున్న కణుజు మాంసం, కొండగొర్రె మృతదేహాన్ని కిందపడేసి పారిపోయారు. గమనించిన ఆర్టీసీ అధికారులు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్ఆర్వో రవికిరణ్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు పాకాలకు చేరుకుని కణుజు మాంసం, కొండగొర్రెను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీసీ ఫుటేజీలను పరిశీలించగా, వేటగాళ్లు చిలుకమ్మనగర్‌కు చెందిన సుధీర్, సమన్, అశోక్‌నగర్‌కు చెందిన యాకాంబ్రం, కొత్తగూడ మండలం మొండ్రాయిగూడేనికి చెందిన లవన్‌కుమార్‌గా గుర్తించారు. వీరిలో సుధీర్‌ను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదంలో యాకాంబ్రం గాయపడడంతో ఎంజీఎం దవాఖానకు తరలించారు. సుమన్, లవన్‌కుమార్ పరారీలో ఉన్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో వెల్లడించారు.

అమరజీవి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న గుండా ప్రకాశ్‌రావు

వరంగల్‌చౌరస్తా, మార్చి16: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఆర్యవైశ్య భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేద కుటుంబం నుంచి 2018లో ఉచిత మెడికల్ సీటు సాధించి, ఎంబీబీఎస్ వైద్య విద్య పూర్తి చేసి హౌస్ సర్జన్ చేస్తున్న పబ్బతి రోషిణి విద్యభ్యాసానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం నుంచి రూ. ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు మల్యాల వీరమల్లయ్య, గుండా మల్లికార్జున్, గన్ను సంపత్‌కుమార్, గాదె వాసుదేవ్, ఎర్రం శ్రీనివాస్, ఉరుకుల్ల పాపారావు, శ్రీలతాదేవి, లావణ్య, ప్రవీణ, మౌనిక, మంజుల, అజయ్ పాల్గొన్నారు.

మళ్లీ పనిచేయని ఏసీలు

- కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిలిచిన ఆపరేషన్లు
- గత ఫిబ్రవరిలోనే చేపట్టిన మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, రోగులు

గత నెల 6వ తేదీన ఏసీ యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్లు (ఫైల్)

వరంగల్ చౌరస్తా, మార్చి 16 : కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మళ్లీ ఏసీలు పనిచేయడం లేదు. గత ఫిబ్రవరి నెలలోనే వీటికి మరమ్మతులు చేయగా, నాలుగు రోజుల నుంచి పాత పరిస్థితే పునరావృతమవుతున్నది. దీంతో వైద్యాధికారులు శస్త్రచికిత్సలు నిలిపివేశారు. కేవలం మైనర్ ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు, మేజర్ శస్త్రచికిత్స అవసరమున్న రోగులను వారం రోజుల తర్వాత రావాలంటూ ఇంటికి పంపిస్తున్నారు. ఆపరేషన్లు చేసే సమయంలో గది ఉష్ణోగ్రత ఒకే విధంగా ఉండాలి. అలా లేకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పేద రోజులు ఉచిత వైద్యానికి దూరమవుతున్నారు. వేసవికి ముందే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి సామర్థ్యానికి అనుగుణంగా ఏసీలు బిగించినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో చీటికి మాటికి మరమ్మతుకు గురవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి ఆపరేషన్లు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి, పంచుతా
- అప్ప చేసి తినే పప్ప కూడుతో రాష్ట్రానికి ముప్ప
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

2 లక్షల మాఫీ అందరికీ చేయలే...

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

ఆర్థిక నిపుణుల విస్మయం

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఆర్బీఐ డాటాను వారు గుర్తుచేస్తున్నారు.

ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025-26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం.

ప్రగతి సభలో సీఎంకు నిరసనసెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలుఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్ డ్యాన్సులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన - ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తుచేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇకదించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పుకోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసలు కాంగ్రెస్ నేతల దూరం

బీఆర్ఎస్ తరఫున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

పిల్లలతో డ్యాన్సులు..

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

రేవంత్ అన్న..?

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చిన వారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడరమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతో పాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు